క్లుప్తంగా

ఆశ్రమ విద్యార్థుల సమస్యలపై వినతి



జేసీ ధాత్రి రెడ్డికి వినతి పత్రం అందిస్తున్న ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు

ఏలూరు (టూటౌన్): ఏలూరు జిల్లా కుక్కునూరు మండలం మాధవరం గ్రామంలోని ఆశ్రమ పాఠశాలలో విద్యార్థుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ జేసీ ధాత్రి రెడ్డికి ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు కె.లెనిన్ మాట్లాడుతూ ఏలూరు జిల్లాలో ఆశ్రమ పాఠశాల హాస్టల్స్ మెరుగుపడాలంటే విద్యార్థులు తమ జీవితాలు త్యాగం చేయాల్సిన పరిస్థితి ఏర్పడుతోందన్నారు. గతంలో పోలవరం నియోజకవర్గంలో ఆశ్రమ పాఠశాలల్లో మెరుగైన సదుపాయాలుకావాలంటే విద్యార్థులు ప్రాణ త్యాగాలు చేస్తేనే వచ్చేవని గుర్తు చేశారు. తక్షణం కుక్కునూరు మండలంలోని ఆశ్రమ పాఠశాల హాస్టల్స్‌లో కనీస సదుపాయాలు, సౌకర్యాలు కల్పించాలని డిమాండ్ చేశారు. ఆశ్రమ పాఠశాల ఒక చోట వసతి గృహం ఇంకోచోట ఉన్నాయని చెప్పారు. కార్యక్రమంలో ఇ.పవన్, జయంత్ తదితరులు పాల్గొన్నారు.

మెడికల్ విద్యార్థుల్లో విషాదం

ఏలూరు రూరల్ : ఏలూరు ఆశ్రం మెడికల్ కళాశాల విద్యార్థుల్లో విషాదం నెలకొంది. ఆదివారం మారేడుమిల్లి విహార యాత్రకు వెళ్లి జలతరంగనిలో కొట్టుకుపోయిన ఇద్దరు విద్యార్థులు అమృత, సౌమ్యల మృతదేహాలు అధికారులు కనుగొన్నారు. మరో విద్యార్థి హరిదీప్ జాడ కానరాలేదు. ఈ విషయం తెలుసుకున్న కళాశాల విద్యార్థులు తీవ్ర ఆవేదనకు గురయ్యారు. నిన్నటి వరకు కలిసి చదువుకున్న తోటి స్నేహితులు విగత జీవులు కావడాన్ని జీర్ణించుకోలేకపోతున్నారు. మృతదేహాలకు పోలీసులు రంపచోడవరం ప్రభుత్వ ఆసుపత్రిలో పోస్టుమార్టం నిర్వహించి అంబులెన్స్‌లో స్వస్థలమైన విజయనగరానికి పంపించామని ఆశ్రం సీఈఓ కె.హనుమంతురావు తెలిపారు. మంగళవారం కళాశాలలో సంతాప కార్యక్రమం నిర్వహించనున్నట్లు సీఈఓ చెప్పారు.

కో ఆప్షన్ సభ్యులుగా మూడు నామినేషన్ల దాఖలు

ఏలూరు (టూటౌన్) : ఏలూరు నగరపాలక సంస్థ పాలకవర్గంలో ఖాళీగా ఉన్న మూడు కో ఆప్షన్ సభ్యుల పదవులకు సంబంధించి అదనపు కమిషనర్ జి.చంద్రయ్యకు సోమవారం ముగ్గురి నుంచి నామినేషన్ పత్రాలు అందాయి. వీటిలో టీడీపీ అభ్యర్థులు మాజీ డిప్యూటీ మేయర్ చోడే వెంకటరత్నం, మాజీ కౌన్సిలర్ కొల్లేపల్లి రాజు, మాజీ కార్పొరేటర్ జాల సుమతి ఉన్నారు.

ఇళ్ల కోసం ఎదురుచూపులు

- టిడ్కో ఇళ్ల పంపిణీపై స్పందించని కూటమి ప్రభుత్వం
- ఎన్నికల హామీ అమలుపై నిర్లక్ష్యం
- లబ్ధిదారుల ఆవేదన



పోణంగి రోడ్డులో టిడ్కో ఇళ్ల బ్లాకులు



నిర్మాణం మధ్యలోనే నిలిచిన టిడ్కో ఇళ్లు

ఏలూరు (టూటౌన్): ఏళ్ల నాటి నిరీక్షణ ఇప్పటికైనా ఫలించేనా అని టిడ్కో ఇళ్ల లబ్ధిదారులు వాపోతున్నారు. టిడ్కో ఇళ్లను పంపిణీ చేసేస్తామంటూ ఎన్నికల ప్రచారంలో ఉత్తర ప్రగల్బాలు పలికిన టీడీపీ కూటమి నాయకులు అధికారం చేపట్టి 100 రోజులు దాటినా ఆ హామీ నెరవేర్చకపోవడంతో ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. చేసే పనులకు చెప్పే మాటలకు వాస్తవ పరిస్థితులు చాలా దూరంగా ఉన్నాయంటూ లబ్ధిదారులు దుమ్మెత్తి పోస్తున్నారు. పేదల పట్ల రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వానికి ఎటువంటి చిత్త శుద్ధీ లేదంటూ విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ప్రచార ఆర్భాటమే తప్ప క్షేత్ర స్థాయిలో నిరుపేదలకు ఒనకూరే ప్రయోజనం ఏమీ లేదని విమర్శిస్తున్నారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం టిడ్కో ఇళ్లను తక్షణమే తమకు అందజేయాలని లబ్ధిదారులు కోరుతున్నారు.

నాడు చేతివాటం ప్రదర్శించారు

ఏలూరు నగర పాలకసంస్థ పరిధిలో టిడ్కో ఇళ్లకు 2018లో మొత్తం 6,480 మంది పేద, మధ్య తరగతి ప్రజలు దరఖాస్తు చేసుకున్నారు. పరిశీలన అనంతరం 4,272 మందిని అనర్హులుగా నిర్ధారించారు. మిగిలిన 2,208 మందిని అర్హులుగా గుర్తించారు. ఈ క్రమంలో నాటి డివిజన్ల కార్పొరేటర్లు తమ చేతి వాటాన్ని ప్రదర్శించారు. తమకు తాయిలాలు ఇచ్చిన వారికే ఇళ్లు కేటాయించారని విమర్శలు ఉన్నాయి. లబ్ధిదారులు రూ.50 వేలు చొప్పున తమ వాటా సొమ్ము చెల్లించారు. బ్యాంకు వడ్డీ లెక్క కట్టినా తాము చెల్లించిన మొత్తం రెట్టింపయ్యేదని, నేటికీ తమకు ఇళ్లు స్వాధీనం చేయలేదని లబ్ధిదారులు వాపోతున్నారు.

60 ఎకరాల స్థలంలో ఇళ్ల నిర్మాణం

ఏలూరు నగరపాలక సంస్థలో గుర్తించిన టిడ్కో లబ్ధిదారులకు ఇళ్ల నిర్మాణం నిమిత్తం పోణంగి రోడ్డులో 60 ఎకరాల భూమిని సేకరించారు. ఆ ప్రాంతంలో ఒక్కో బ్లాకుకు 48 ఫ్లాట్స్ చొప్పున మొత్తం 100 బ్లాకుల్లో 4,800 ఫ్లాట్లు నిర్మించేందుకు లక్ష్యంగా పెట్టుకున్నారు. తొలి విడతలో అర్హులకు 40 బ్లాకుల్లో ఇళ్ల నిర్మాణం చేపట్టారు. వీటిలో ఇప్పటి వరకు 20 ఫ్లాట్లు మాత్రమే నివాసయోగ్యంగా నిర్మించారు. మరో 20 ఫ్లాట్లు 80 శాతం మేర నిర్మాణం పూర్తి చేశారు. మిగతా వన్నీ వివిధ స్టేజీల్లో ఉన్నాయి.

ఇళ్లు వెంటనే అప్పగించాలి



నిర్మాణం పూర్తయిన టిడ్కో ఫ్లాట్లను వెంటనే లబ్ధిదారులకు అందించాలి. ఎన్నికలకు ముందు టిడ్కో ఇళ్లు అధికారంలోకి వచ్చిన వెంటనే అప్పగిస్తామంటూ చెప్పిన టీడీపీ అధికారం చేపట్టి మూడు నెలల దాటినా నేటికీ నోరు మెదపకపోవడం దారుణం. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు సంక్రాంతి నాటికల్లా టిడ్కో ఇళ్లను లబ్ధిదారులకు అందించే ఏర్పాట్లు చేయాలి.

– బండి వెంకటేశ్వరరావు, సీపీఐ రాష్ట్ర కంట్రోల్ మిషన్ కార్యదర్శి, ఏలూరు

రూ.50 వేలు కట్టి ఏడేళ్లయింది



టిడ్కో ఇంటి కోసం రూ.50 వేలు కట్టి ఏడేళ్లు దాటింది. ఇంత వరకు నాకు ఇళ్లు అప్పగించలేదు. పేదల సంక్షేమాన్ని కూటమి ప్రభుత్వం అస్సలు పట్టించుకోవడం లేదు. 100 రోజుల పాలన మంచి ప్రభుత్వం అంటూ సొంత డబ్బా కొట్టుకోవడం మినహా మా గోడు పట్టించుకున్న పాపాన లేదు. ఇప్పటికైనా ప్రభుత్వం ఆలోచించి, పూర్తయిన ఇళ్లను లబ్ధిదారులకు అందించాలి.

– గొర్లి స్వాతి, లబ్ధిదారురాలు, కుమ్మర రేవు, 29వ డివిజన్ ఏలూరు

గురు గీతారాజ్ కర్కేరాకు అవార్డు

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): నాట్య కళారత్న గురు గీతారాజ్ కర్కేరాను 2024వ సంవత్సరపు కేవీఎస్ ఎక్సలెన్స్ పురస్కారానికి ఎంపిక చేశామని నగరానికి చెందిన కళారత్న కేవీ సత్యనారాయణ తెలిపారు. సోమవారం స్థానిక వైఎంహెచ్‌ఏ హాలులో ఆయన విలేకర్లతో మాట్లాడారు. తన జన్మదినం సందర్భంగా ఈ ఏడాది 18వ పురస్కారాన్ని ఈ నెల 26వ తేదీ మధ్యాహ్నం స్థానిక వైఎంహెచ్‌ఏ హాలులో గీతారాజ్ కర్కేరాకు పురస్కార ప్రదాన కార్యక్రమం ఏర్పాటు చేశామన్నారు. ఈ మేరకు ఆహ్వాన పత్రికను విడుదల చేశారు. హిందూ యువజన సంఘం ఉపాధ్యక్షులు కేకే గుప్తా, ఇరదల ముద్దుకృష్ణ, వేణుగోపాల్ లునాని, వేమా కోటేశ్వరరావు, కార్యనిర్వాహక కమిటీ ప్రధాన కార్యదర్శి మజ్జి కాంతారావు, తదితరులు పాల్గొన్నారు.

26 నుంచి కావూరిలో కంప్యూటర్ శిక్షణ

ఏలూరు (టూటౌన్): ఏలూరు వసంత మహల్ సెంటర్ వెంకట్రామా ప్రెస్ రోడ్డులోని కావూరి ఫౌండేషన్ కార్యాలయంలో ఈ నెల 26 నుంచి కంప్యూటర్ శిక్షణ ప్రారంభించనున్నట్లు కార్యాలయ వర్గాలు సోమవారం ఒక ప్రకటనలో తెలిపాయి. పదో తరగతి ఉత్తీర్ణులైన వారికి ట్రైపు, డీసీఏ, డీపీపీలోనూ, కామర్స్‌తో ఇంటర్ ఉత్తీర్ణులైన వారికి టాలీలోనూ శిక్షణ ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. ఈ నెల 24 నుంచి సంస్థ కార్యాలయం వద్ద దరఖాస్తు చేసుకోవాలని, ఈ అవకాశాన్ని ఏలూరు నగరం, పరిసర ప్రాంతాల ప్రజలు సద్వినియోగం చేసుకోవాల్సిందిగా కోరారు.

రంగారావు ఆశయాలను నెరవేర్చుతాం



పత్తేబాదలో వృద్ధాశ్రమంలో భోజనం పెడుతున్న శ్రీలక్ష్మి, శ్రీదేవి

ఏలూరు టౌన్: సమాజంలో పేదలను, ఆదరణ లేని వారికి అండగా నిలవాలనే తన తండ్రి మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్, అఖిలభారతీయ యాదవ మహాసభ రాష్ట్ర గౌరవాధ్యక్షుడు దివంగత పిల్లంగోళ్ల రంగారావు ఆశయాలను నెరవేర్చేందుకు తమవంతు కృషి చేస్తున్నామని రాష్ట్ర సాహిత్య అకాడమీ మాజీ చైర్‌పర్సన్ పిల్లంగోళ్ల శ్రీలక్ష్మి అన్నారు. రంగారావు వర్ధతిని పురస్కరించుకుని ఏలూరు పత్తేబాద రైతుబజార్ వెనుక నిశ్చింత మదర్ థెరిస్సా సేవా సంఘం ఆధ్వర్యంలో నిర్వహిస్తోన్న వృద్ధాశ్రమంలో వృద్ధులకు సోమవారం మధ్యాహ్నం పండ్లు, భోజనం అందజేశారు. పిల్లంగోళ్ల రంగారావు చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో కుటుంబ సభ్యులంతా స్వయంగా భోజనాన్ని వడ్డించటంతోపాటు వారితో కొద్దిసేపు గడిపారు. కార్యక్రమంలో ఏడో డివిజన్ కార్పొరేటర్ పిల్లంగోళ్ల శ్రీదేవి, వైదేహి పూర్ణ, ఉక్కుసూరి రమేష్ బాబు, కుటుంబ సభ్యులు ఉన్నారు.

కార్మిక హక్కులను హరిస్తున్న లేబర్ కోడ్‌లు



పాతబస్టాండ్ వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న కార్మిక నేతలు

ఏలూరు (టూటౌన్): 44 కార్మిక చట్టాల స్థానంలో తెచ్చిన లేబర్ కోడ్‌లు కార్మిక హక్కులను హరిస్తాయని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఆర్ లింగరాజు, ఐఎఫ్‌టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి బద్దా వెంకట్రావు, ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి కె.బుచ్చిబాబు విమర్శించారు. నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని కేంద్ర కార్మిక సంఘాల పిలుపులో భాగంగా ఏలూరు పాతబస్టాండ్ వద్ద సోమవారం బ్లాక్ డే కార్యక్రమం నిర్వహించారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహం వద్ద నినాదాలు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్రంలోని మోదీ ప్రభుత్వం నాలుగేళ్ల క్రితం కరోనా సమయంలో ప్రజలను ఏమార్చి కార్మిక చట్టాల స్థానంలో నాలుగు లేబర్ కోడ్‌లను తెచ్చిందన్నారు. ఈ లేబర్ కోడ్లను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కనీస వేతనాలు పీఎఫ్, ఈఎస్ఐ, బోనస్, పని గంటలు కార్మిక సంఘాలు పెట్టుకునే హక్కును ఈ లేబర్ కోడ్‌లు హరిస్తాయన్నారు. కార్మికులను బానిసలుగా మార్చి కార్పొరేట్లకు వారి శ్రమను దోచిపెట్టడమే లక్ష్యంగా ఈ లేబర్ కోడ్లను మోదీ ప్రభుత్వం తెచ్చిందన్నారు. కార్యక్రమానికి సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు బి.సోమయ్య, జిల్లా కార్యదర్శి కొర్రి విజయలక్ష్మి, నాయకులు మావూరి శ్రీనివాస్, వైఎస్ కనకారావు, ఐఎఫ్‌టీయూ నాయకులు యర్ర శ్రీనివాసరావు, మంగం అప్పారావు, దూళ్ల వీరినాయుడు, కాకర్ల శ్రీను, రాచేటి శ్రీను, ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు ఆర్ శ్రీనివాస డాంగే, ఎ.అప్పలరాజు, భజంత్రీ శ్రీనివాసరావు, యు.హేమ సుందర్ తదితరులు నాయకత్వం వహించారు.

బాల్య వివాహాలను అరికట్టాలి

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): బాల్య వివాహాలను అరికట్టే బాధ్యత ప్రతి విద్యార్థిపైనా ఉందని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర బాలల హక్కుల కమిషన్ సభ్యులు జె.రాజేంద్ర ప్రసాద్ అన్నారు. సోమవారం స్థానిక సెయింట్ థెరీస్సా డిగ్రీ, పీజీ బాలికల కళాశాలలో బాల్యవివాహ నిరోధంపై విద్యార్థులో ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ దేశంలో నేషనల్ ఫ్యామిలీ హెల్త్ స్కీం జరిపిన సర్వే నివేదిక ఆంధ్రప్రదేశ్‌లో బాల్య వివాహాలు ఎక్కువగా జరుగుతున్నాయని తెలిపారు. విద్యార్థులు చదువుకు సంబంధించి సెల్ ఫోన్‌లో మంచిని మాత్రమే అభ్యసించాలని, చెడు విషయాలకు దూరంగా ఉండాలని సూచించారు. తక్కువ వయసులో బాల్య వివాహం చేసుకోవడం వల్ల వచ్చే నష్టాలు, ఆరోగ్య పరిస్థితులపై అవగాహన కల్పించారు. సెయింట్ థెరీస్సా కళాశాల ప్రిన్సిపాల్ సిస్టర్ మెర్సీ, చైల్డ్ రైట్స్ అడ్వకసి ఫౌండేషన్ జిల్లా కో ఆర్డినేటర్ ఆర్ వినోద్ కుమార్, జి.రాజ్యలక్ష్మి, కళాశాల సిబ్బంది పాల్గొన్నారు.

స్కూల్ శానిటేషన్ వర్కర్ల ధర్నా



డీఈఓ కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న శానిటేషన్ వర్కర్లు

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): ప్రభుత్వ పాఠశాలల శానిటేషన్ వర్కర్లకు చెల్లించాల్సిన బకాయి జీతాలు వెంటనే చెల్లించాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు బి.సోమయ్య డిమాండ్ చేశారు. సోమవారం ఏలూరు పరిసర మండలాలకు చెందిన స్కూల్ శానిటేషన్ వర్కర్స్ ఏలూరులోని డీఈఓ కార్యాలయం వద్ద ధర్నా చేశారు. ఈ సందర్భంగా సోమయ్య మాట్లాడుతూ శానిటేషన్ వర్కర్స్‌కు రావాల్సిన ఐదు నెలల బకాయి జీతాల కోసం ఈ నెల రెండో తేదీ నుంచి ప్రభుత్వ పాఠశాల శానిటేషన్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో ఆందోళన నిర్వహిస్తున్నట్టు చెప్పారు. తమ ఆందోళనతో మూడు నెలల జీతాలు విడుదలకు ప్రభుత్వం జీఓ విడుదల చేసినప్పటికీ బడ్జెట్ రాలేదనే పేరుతో నేటికీ జీతాలు ఇవ్వలేదని తెలిపారు. తక్షణమే బకాయి జీతాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు పి.దుర్గ, కె.వి జయలక్ష్మి మాట్లాడారు. అనంతరం జిల్లా విద్యాశాఖ ఏడీలు అవధాని, షరీఫ్‌లకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మూడు నెలల జీతాలు విడుదల చేస్తున్నామని, ఈ మొత్తం స్కూలు స్వీపర్ల అకౌంట్లలో పడతాయని తెలిపారు. ఈ సందర్భంగా అధికారులకు యూనియన్ నాయకులు ధన్యవాదాలు తెలిపారు.

27 నుంచి స్కూల్ కాంప్లెక్స్ సమావేశాలు

దెందులూరు: స్వర్ణాంధ్ర ఎట్ ద రేటాఫ్ 2047పై 6వ తరగతి నుంచి పదో తరగతి విద్యార్థులకు అవగాహన కల్పించేందుకు పాఠశాల స్థాయి, మండల, జిల్లా స్థాయిలో స్కూల్ కాంప్లెక్స్ సమావేశాలు ఈ నెల 27, 28, 29 తేదీల్లో నిర్వహిస్తామని దెందులూరు ఎంఈఓ ఏవీఎస్‌వీ ప్రసాద్ తెలిపారు. విద్యాశాఖ ఆదేశాల మేరకు వ్యాసరచన, వక్తృత్వం, డిబేట్‌లో ఈ పోటీలు నిర్వహించాలన్నారు. జిల్లా స్థాయి విజేతలకు ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు ఇస్తారన్నారు. మొదటి బహుమతి రూ.700 విలువ గల, పుస్తకం, సర్టిఫికెట్, ద్వితీయ బహుమతిగా రూ.500 విలువ గల పుస్తకం, సర్టిఫికేట్, తృతీయ బహుమతిగా రూ.300 విలువ గల పుస్తకం, సర్టిఫికేట్ అందిస్తామన్నారు. మండలంలో విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఆర్టీసీ సమాచారం

ఏలూరు ఆర్టీసీ డిపో నుంచి దూరప్రాంతాలకు వెళ్లే బస్సుల సమయాలు, రిజర్వేషన్ వివరాలు

ఏసీ బస్సులు..

బస్సు రూటు	సమయం	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ (ఇంద్ర)	21.00	35
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ (అమరావతి)	22.00	44
ఏలూరు - బీహెచ్‌ఈఎల్ (స్టార్ లైనర్ నాన్‌ఏసీ స్లీపర్)	22.30	21
ఏలూరు - తిరుపతి(ఇంద్ర)	19.00	37

సూపర్ లగ్జరీ

బస్సు రూటు	సమయం	సర్వీస్ నంబర్	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు - బీహెచ్‌ఈఎల్	21.45	4820	32
ఏలూరు - బీహెచ్‌ఈఎల్	21.15	4822	33
ఏలూరు - బీహెచ్‌ఈఎల్ వయా కే.కోట	19.30	4796	31
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ వయా రామచంద్రపురం	19.45	4798	32
ఏలూరు-జీడిమెట్ల వయా ఖమ్మం	20.15	4802	32
ఏలూరు-బీహెచ్‌ఈఎల్ వయా ఖమ్మం	20.30	4800	32
ఏలూరు - బీహెచ్‌ఈఎల్ వయా ఖమ్మం	21.00	4804	35
ఏలూరు - ఈసీఐఎల్	22.30	4814	31
ఏలూరు - తిరుపతి	16.00	4830	33

కూరగాయల ధరలు

ఏలూరు నగరంలోని రైతు బజార్లలో కూరగాయల ధరలు

కూరగాయలు	కిలో ధర	కూరగాయలు	కిలో ధర
టమాటాలు	44	అరటి కాయ (1)	07-10
వంకాయలు (గులాబీ)	64	చిక్కుడు కాయలు	76-144
వంకాయలు (కాంతులు)	64	చామదుంపలు	48
వంకాయలు (తెలుపు)	50-56	ములక్కాడలు	07,10
బెండకాయలు	32	కంద	70
పచ్చిమిర్చి	30	బీట్‌రూట్	38
కాకర కాయలు	40-48	కీరా దోస	44
బీరకాయలు	40	ఫ్రెంచ్‌బీన్స్	66
బీరకాయలు (పందిరి)	58	అల్లం	70-130
క్యాబేజీ	28	కొత్తిమీర (కట్ట)	35
క్యారెట్	40-50	పాలకూర	15
దొండకాయలు	48	చుక్కకూర	15
బంగాళదుంపలు	40	తోటకూర	15
ఉల్లిపాయలు	58	గోంగూర	07
గోరుచిక్కుడు	48	పుదీనా	05
దోసకాయలు	30	బఠాణి	--
ఆనబకాయ (1)	30-40	క్యాప్సికమ్	76
పొట్లకాయ(1)	20	చిలకడదుంప	58

ఏపీ జెన్‌కోకు ఏలూరు సీసీఎస్ సీఐ మురళీకృష్ణ



సీఐ మురళీకృష్ణను సత్కరిస్తున్న పోలీస్ సిబ్బంది

ఏలూరు టౌన్: ఏలూరు సెంట్రల్ క్రైమ్ స్టేషన్ (సీసీఎస్) సీఐగా పనిచేసిన సీహెచ్ మురళీకృష్ణను విజయవాడ ఏపీ జెన్‌కో సీఐగా డిప్యుటేషన్‌పై బదిలీ చేశారు. సాధారణ బదిలీల్లో భాగంగా ఆయన్ని పోలీస్ ఉన్నతాధికారులు బదిలీ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. ఆయన సోమవారం రాత్రి విధుల నుంచి రిలీవ్ అయ్యారు. ఏలూరు సీసీఎస్ సిబ్బంది సీఐ మురళీకృష్ణను ఘనంగా సత్కరించారు. 2022 ఏప్రిల్ 4న ఏలూరు సీసీఎస్ సీఐగా బాధ్యతలు స్వీకరించగా, ఆయన రెండేళ్ల ఐదు నెలల కాలం విధులు నిర్వర్తించారు. ఏలూరు జిల్లాలో చోరీలను నిరోధించటంలోనూ, కేసులను చేధించటంలో తన దైన శైలిలో సమర్థవంతంగా పనిచేశారు.

ర్యాగింగ్‌కు దూరంగా ఉండండి

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): విద్యార్థులు ర్యాగింగ్‌కు దూరంగా ఉండాలని, ర్యాగింగ్‌కు పాల్పడితే బంగారు భవిష్యత్ నాశనమౌతుందని ఏలూరు మహిళా పోలీస్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ ఎం సుబ్బారావు, మహిళా ఎస్సై కాంతి ప్రియ, సైబర్ సెల్ ఎస్సై మధు వెంకట రాజా హెచ్చరించారు. ఏలూరు జిల్లా ఎస్పీ కె.ప్రతాప్ శివ కిషోర్ ఆదేశాల మేరకు సోమవారం స్థానిక సీఆర్‌ఆర్ మహిళా కళాశాల విద్యార్థులకు యాంటీ ర్యాగింగ్, సైబర్ క్రైమ్ అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎదుటివారిపై ర్యాగింగ్‌కు పాల్పడితే చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటారని, ర్యాగింగ్‌కి దూరంగా ఉండి, తల్లిదండ్రుల ఆశయ సాధన కోసం ప్రతి ఒక్కరు విద్యాభ్యాసాన్ని పూర్తి చేసి ఉన్నత శిఖరాలు అధిరోహించాలని సూచించారు. అపరిచిత వ్యక్తులతో పరిచయాలు మంచివి కావని, సోషల్ మీడియాలో గుర్తు తెలియని వ్యక్తులతో జాగ్రత్తలు తీసుకోవాలని అన్నారు. సోషల్ మీడియా ద్వారా జరిగే మోసాలకు విద్యార్థినులు గురి కాకూడదని తెలియజేసి, మోసాలకు గురైతే వెంటనే 1930కి సమాచారం అందిస్తే వెంటనే పోలీసులు సహాయ సహకారాలు అందిస్తారని తెలిపారు.

రఘురామకృష్ణరాజును వెంటనే బర్తరఫ్ చేయాలి

- అతనిపై అట్రాసిటీ కేసు నమోదు చేయాలని డిమాండ్
- క్షమాపణలు చెప్పకుంటే ఆందోళనను ఉధృతం చేస్తాం : దళిత సంఘ నేతలు



భీమడోలులో రఘురామకృష్ణరాజును అరెస్ట్ చేయాలని డిమాండ్ చేస్తున్న దళిత సంఘాల నాయకులు



భీమడోలు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేస్తున్న దళిత సంఘాల నాయకులు



ఖండ్రికనర్సింహపురంలో అంబేడ్కర్ విగ్రహం వద్ద నిరసన చేస్తున్న అంబేడ్కర్ వాదులు

భీమడోలు: కాళ్ల మండలం ఏలూరుపాడులో రాజ్యాంగ నిర్మాత బీఆర్ అంబేడ్కర్ చిత్రపటం గల ఫ్లెక్సీని తొలగించి తీవ్రంగా అవమానపర్చిన ఉండి ఎమ్మెల్యే కనుమూరి రఘురామకృష్ణరాజును వెంటనే అరెస్ట్ చేయాలని, ఆయనను ఎమ్మెల్యే పదవి నుంచి బర్తరఫ్ చేయాలని కోరుతూ సోమవారం మాలజాతి యోధుల పోరాట సంఘం నాయకులు డిమాండ్ చేశారు. జాతీయ రహదారి భీమడోలు జంక్షన్‌లో మండల శాఖ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమాన్ని నిర్వహించారు. రఘురామకృష్ణరాజుకు వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ కదం తొక్కారు. ఆయనపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. దేశ ప్రజలందరికీ క్షమాపణలు చెప్పాలని, లేని పక్షంలో ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ సందర్భంగా అల్ ఇండియా దళిత నాయకులు మెండెం సంతోష్‌కుమార్ మాట్లాడుతూ అంబేడ్కర్ రచించిన రాజ్యాంగం ద్వారా రెండుసార్లు ఎన్నికై పార్లమెంట్, అసెంబ్లీల సాక్షిగా ప్రమాణం చేసిన రఘురామ అహంకార ధోరణిని ప్రదర్శించడం దారుణమన్నారు. అలాంటి వ్యక్తికి ప్రజలే బుద్ధిచెప్తారన్నారు. రాష్ట్ర నాయకులు ముళ్లగిరి జాన్సన్ మాట్లాడుతూ అంబేడ్కర్‌ను అవమానపర్చడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. తక్షణమే సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ స్పందించి సమగ్ర విచారణ చేసి ఎమ్మెల్యే పదవి నుంచి రఘురామకృష్ణరాజును బర్తరఫ్ చేయాలని కోరారు. అనంతరం ఎమ్మెల్యే రఘురామను వెంటనే అరెస్ట్ చేయాలని భీమడోలు ఏఎస్సై చలపతిరావుకు ఫిర్యాదు చేశారు. ఈ కార్యక్రమంలో చైతన్య యువజన సంఘం జిల్లా అధ్యక్షుడు పాము మాన్‌సింగ్, జిల్లా నాయకులు అంబటి నాగేంద్రప్రసాద్, నాయకులు కూరపాటి రవి, వెంపా వెంకట్రావు, కమ్మిన విల్సన్‌రాజు, కుచ్చెర్ల రాజేష్, ఓరా జయరాజు, సంఘాల నాయకులు పాల్గొన్నారు.

ఖండ్రికనర్సింహపురంలో నిరసన

దెందులూరు: భారత రాజ్యాంగ నిర్మాత బీఆర్ అంబేడ్కర్‌ను అవమానపరిచిన ఎమ్మెల్యే రఘురామకృష్ణరాజును వెంటనే అరెస్టు చేయాలని అంబేడ్కర్ సంఘం రాష్ట్ర నాయకులు మాంద్ర మధుబాబు, చిలకా హరీష్, సరిపల్లి మహేష్, గొలిమే హరిబాబు, భీమడోలు రామకృష్ణ, ఉండ్రాజవరపు నాగు, గొలిమే శ్రీను, చిలకా వంశీ, విష్ణు, భీమడోలు పవన్, తానిగడప సంతోష్ డిమాండ్ చేశారు. ప్రపంచంలో అన్ని దేశాల్లో భారత రాజ్యాంగ నిర్మాత అంబేడ్కర్ విగ్రహాన్ని విదేశాల్లో పెట్టి గౌరవిస్తుంటే అహంకారంతో ఎమ్మెల్యే పదవిని అడ్డంపెట్టుకుని అంబేడ్కర్‌ను ఘోరంగా అవమానపరిచిన రఘురామకృష్ణరాజు ఎమ్మెల్యే పదవి నుంచి బర్తరఫ్ చేయాలన్నారు. దర్యాప్తు సంస్థలు ఎస్సీ కమిషన్, హైకోర్టు, మానవ హక్కుల కమిషన్ దీనిపై సుమోటోగా స్పందించకపోతే త్వరలోనే గిరిజన, ఎస్సీ, ఎస్టీ, బీసీ సంఘాలు రాష్ట్ర వ్యాప్త ఉద్యమానికి శ్రీకారం చుడతామని రాష్ట్ర నాయకులు అన్నారు. రాజ్యాంగం విలువ, రాజ్యాంగం రాసిన వారి విలువ తెలియని రఘురామకృష్ణరాజు ఎమ్మెల్యే పదవిలో ఉండటం నియోజకవర్గానికి, రాష్ట్రానికి ప్రమాదకరమన్నారు. దళితులు, బీసీలు, గిరిజనులు ఆగ్రహం చవిచూడకముందే కూటమి పెద్దలు స్పందించి ఎమ్మెల్యే పదవికి రఘురామకృష్ణరాజుతో రాజీనామా చేయించాలన్నారు. దర్యాప్తు సంస్థలు అతనిపై చర్యలు తీసుకోకపోతే ఉద్య మాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు.